వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

వరికి కాండం తొలిచే పురుగు

- రాష్ట్రవ్యాప్తంగా పంటకు తీవ్రనష్టం
- ఆందోళన వద్దంటున్న శాస్త్రవేత్తలు
- సరైన యాజమాన్య పద్ధతుల సూచన

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా వరి పంటకు కాండం తొలిచే పురుగు వ్యాపించింది. ముందుగా వరి నాట్లు వేసిన పొలాల్లో ఈ తెగులు వ్యాప్తి ఎక్కువగా ఉన్నది. ఈ తెగులు ప్రభావంతో వరి పంట ఎదుగుదల నిలిచిపోవడంతోపాటు నీళ్లు ఉన్నప్పటికీ ఎండిపోయినట్టుగా పంట కనిపిస్తున్నది. ఈ పురుగు వరి పంటకు నష్టం చేస్తుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అవగాహన లేకుండా ఏవేవో మందులను పిచికారి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు ఆందోళన చెందొద్దంటూ రైతులకు భరోసా ఇస్తున్నారు. సరైన యాజమాన్య పద్ధతులను పాటిస్తే తెగులు అంతమవుతుందని సూచిస్తున్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ ఇతర శాస్త్రవేత్తలతో కలిసి కాండం తొలిచే పురుగు వ్యాపించిన వరి పంటల పొలాలను పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు.

కాండం తొలిచే పురుగు నివారణ యాజమాన్య పద్ధతులు

1. వరి పంటకు కాండం తొలిచే పురుగు వ్యాపించిందా లేదో గమనించడానికి దీపపు ఎర లేదా సోలార్ దీపపు ఎర లేదా లింగాకర్షక బుట్టలను అమర్చుకొని రెక్కల పురుగులపై నిఘా పెట్టాలి.

2. పిలక దశలో ఎకరాకు మూడు లింగాకర్షక బుట్టలు పెట్టి అందులో వారానికి బుట్టకు 25 నుంచి 30 పురుగులు పడినప్పుడు తప్పనిసరిగా సస్యరక్షణ చేపట్టాలి.

3. ప్రధాన పొలంలో గుళికల మందులు వాడితే ఖర్చు ఎక్కువవుతుంది కాబట్టి నారు నాటేందుకు వారం రోజుల ముందు ఎకరాకు పొలంలో 800 గ్రాముల కార్బోఫ్యురాన్ 3జి గుళికలు లేదా 600 గ్రాముల ఫిప్రోనిల్ 0.3గ్రా గుళికలు చల్లాలి.

4.ఒకవేళ నారుమడిలో పైన పేర్కొన గుళికలను చల్లని పక్షంలో 15 రోజుల వయసున్న లేదా పిలక దశలో ఉన్న వరి పైరులో తప్పకుండా ఎకరాకు కార్బోఫ్యురాన్ 3జి గుళికలు 10 కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు 8 కిలోలు లేదా క్లోరంట్రానీలి ప్రోల్ 0.4జి నాలుగు కిలోలు చల్లుకోవాలి.

5. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే కాండం తొలిచే పెరుగు లార్వాదశలో వరిపై నష్టపరుస్తున్నది. ఇలాంటి ప్రాంతాల్లో లీటర్ నీటిలో కార్ట్‌ఆఫ్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్పీ రెండు గ్రాములు చొప్పున కలిపి పిచికారి చేయాలి.

6. వరి పొలంలో జింక్ పోషకాల లోపం ఉంటే దీని నివారణకు రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి.

ప్రాజెక్టుల అప్పగింతపై రేపు కేఆర్ఎంబీ భేటీ

- సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల అప్పగింతపై చర్చ

హైదరాబాద్, జనవరి 30(నమస్తే తెలంగాణ): శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల అప్పగింతపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) గురువారం కీలక సమావేశం నిర్వహించనున్నది. ఈ సమావేశానికి హాజరుకావాల్సిందిగా రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ అధికారులకు లేఖ రాసింది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం శ్రీశైలం డ్యామ్ ఏపీ పరిధిలో, నాగార్జునసాగర్ డ్యామ్ తెలంగాణ పరిధిలో ఉండాలి. తెలంగాణ, ఏపీ అధికారులతో కేంద్ర జలశక్తిశాఖ ఈ నెల 17న సమావేశమైంది. శ్రీశైలం, నాగార్జునసాగర్ డ్యామ్‌లతోపాటు వాటికి సంబంధించిన 15 ఔట్‌లెట్లు, ఆస్తులు, ఉద్యోగులను నెలరోజుల్లోగా బోర్డుకు అప్పగించాలని ఇరు రాష్ట్రాలను ఆదేశించారు. ఇందుకు ఏపీ ఒప్పుకోగా తెలంగాణ అధికారులు వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో గురువారం మరోసారి సమావేశం కావాలని కేఆర్ఎంబీ నిర్ణయించింది. ఇటీవలి సమావేశంలో ప్రాజెక్టులకు సంబంధించి ఇరు రాష్ట్రాలు ఒప్పుకొన్నట్టు పలు అంశాలను లేఖలో ప్రస్తావించింది. ప్రాజెక్టుల అప్పగింత తదితర అంశాలపై ఏడురోజుల్లోగా కచ్చితమైన కార్యాచరణతో వస్తామని అంగీకరించిన విషయాన్ని గుర్తు చేసింది.

ఎగువన ఎండబెట్టి.. దిగువకు పారకం!

మొదటిపేజీ తరువాయి...

కాలువ 0-146 కిలోమీటర్లు ఎల్ఎండీ వరకు 4,62,920 ఎకరాలు, దిగువన అంటే కాకతీయ కెనాల్ 146-284 కిలోమీటర్ల వరకు అంటే మైలారం వరకు 5,05720 ఎకరాలు మొత్తంగా 9,68,640 ఎకరాల ఆయకట్టుకు నీరందించాల్సి ఉన్నది. ఎస్సారెస్పీ నుంచి ఎల్ఎండీ వరకు కాకతీయ ప్రధాన కాలువ పూర్తిస్థాయి సామర్థ్యం 9,700 క్యూసెక్కులు, కాగా ప్రస్తుతం కేవలం 6,500 క్యూసెక్కులను మాత్రమే విడుదల చేస్తున్నారు. ఎల్ఎండీ దిగువ నుంచి బయ్యన్నవాగు వరకు కాలువ ప్రవాహ సామర్థ్యం 6 వేల క్యూసెక్కులు కాగా, ప్రస్తుతం 4 వేల క్యూసెక్కుల కంటే తక్కువగానే విడుదల చేస్తున్నారు. నిరుడికన్నా చాలా తక్కువ పరిమాణంలో నీటిని వదులుతున్నారు. ఇదిలా ఉండగా ఎస్సారెస్పీ నుంచి ఎల్ఎండీ వరకు 94 డిస్ట్రిబ్యూటరీలు ఉన్నాయి. ఎల్ఎండీ దిగువన బయ్యన్నవాగు వరకు మొత్తంగా దాదాపు 54 డిస్ట్రిబ్యూటరీ మెయిన్ కెనాల్స్ ఉన్నాయి. ప్రధాన కాలువకే తక్కువ మొత్తంలో నీటిని విడుదల చేస్తుండటంతో డిస్ట్రిబ్యూటరీలకు సరిపడా నీరందని పరిస్థితి నెలకొన్నది. అదీగాక కాలువలపై వేల సంఖ్యలో మోటర్లను పెట్టి ఎగువన ఉన్న రైతులు నీటిని పంపింగ్ చేసుకుంటున్నారు. దీంతో దిగువకు మరింత తక్కువ మొత్తంలో జలాలు చేరుతున్నాయి. ఆయా డిస్ట్రిబ్యూటరీల్లోని చివరి ఆయకట్టుకు నీరందని దుస్థితి నెలకొన్నది.

కాలువ సగం భాగం వరకే

ఈ ఏడాది యాసంగికి ఎస్సారెస్పీ స్టేజ్ 1లో పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీటిని అందిస్తామని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆ మేరకు ప్రకటించారు కూడా. అయితే ప్రస్తుతం స్టేజ్ 1లో ఉన్న అనేక డిస్ట్రిబ్యూటరీలకు నీటి విడుదలను నిలుపుదల చేశారు. సాగునీరివ్వలేమని రైతులకు తేల్చిచెప్తున్నారు. ప్రధాన కాలువ నుంచి డిస్ట్రిబ్యూటరీలకు నామమాత్రంగా నీటిని విడుదల చేస్తున్నారు. అదీగాక డిస్ట్రిబ్యూటరీ కింద సగం మేరకే నీటి విడుదలను పరిమితం చేస్తున్నారు. ఎల్ఎండీ ఎగువన డీ 53, డీ 86, డీ 39లోనే పూర్తిస్థాయిలో సాగునీరందని పరిస్థితి నెలకొన్నది. ఎల్ఎండీ దిగువన పరిస్థితి మరింత దయనీయంగా మారింది. డీబీఎం 38 కెనాల్ ద్వారా భూపాలపల్లి జిల్లా రేగొండ, చిట్యాల, టేకుమట్ల ప్రాంతాలకు సాగునీరందాల్సి ఉన్నది. ప్రస్తుతం ఆ కాలువ 40వ కిలోమీటర్‌కే అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. దిగువన చిట్యాల, టేకుమట్లకు నీటివిడుదలను పూర్తిగా నిలిపివేశారు. అదేవిధంగా డీబీఎం 40 ద్వారా నల్లబెల్లి, నర్సంపేట తదితర మండలాలకు సాగునీరందాల్సి ఉన్నది. నిరుడు నిండుగా పారిన కాలువ నేడు నామమాత్రంగా పారుతున్నది. ఒక్క నర్సంపేట మండలంలోనే దాదాపు 17 గ్రామాలకు సాగునీరందడం లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అదేవిధంగా డీబీఎం 15 కింద ఇల్లంతకుంట మండలానికి మాత్రమే మోస్తరుగా సాగునీరందుతుండగా, దిగువ ఆయకట్టుకు నీరందడంలేదని రైతులు వాపోతున్నారు. డీబీఎం 6, 7, మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గంలోని డీబీఎం-48, 60 ఇలా ఇంచుమించు అన్ని డిస్ట్రిబ్యూటరీల కింద ఇదే పరిస్థితి నెలకొన్నది. డిస్ట్రిబ్యూటరీ పరిధిలోని సగం ఆయకట్టుకు మాత్రమే నీటిని విడుదల చేస్తున్న పరిస్థితి.

జగిత్యాల జిల్లా తాటిపల్లి వద్ద పారుతున్న కాకతీయ ప్రధాన కాలువ (ఫైల్)

12 గంటలే కరెంటివ్వండి

చివరి ఆయకట్టుకు సాగునీటిని అందించడం అధికారులకు కత్తిమీద సాములా మారింది. కాలువలపై ఎక్కడికక్కడ రైతులు 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్లను అమర్చుకొన్నారు. వచ్చిన నీటిని వచ్చినట్టు తమ పొలాలకు మళ్లించుకుంటున్నారు. ఎగువన విడుదల చేసిన జలాల్లో సగం కూడా దిగువకు చేరని పరిస్థితి నెలకొన్నది. ఈ నేపథ్యంలో పలువురు ఇరిగేషన్ అధికారులు కేవలం 12 గంటలు మాత్రమే కరెంటు ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు సమాచారం. అలాగైతేనే మోటర్ల ద్వారా నీటితోడివేతను అరికట్టి దిగువకు పూర్తిస్థాయిలో ఇచ్చే అవకాం ఉంటుందని, లేదంటే చేసేదేమీ ఉండబోదని స్పష్టంగా తెలియజేసినట్టు సమాచారం

స్టేజ్ 1 ఆయకట్టును పణం పెట్టి స్టేజ్ 2కు

కాకతీయ కాలువను 284 కిలోమీటరు నుంచి 347 కిలోమీటరు వరకు ఎస్సారెస్పీ స్టేజ్ 2గా పిలుస్తారు. డీబీఎం 54 నుంచి డీబీఎం 71 వరకు దీని పరిధిలో ఉన్నాయి. తర్వాత ఇది మూసీలో కలుస్తుంది. కోదాడ, తుంగతుర్తి, సూర్యాపేట తదితర ప్రాంతాలకు సాగునీటిని అందించాల్సి ఉన్నది. స్టేజ్ 2 కాలువ ప్రవాహ సామర్థ్యం 4 వేల క్యూసెక్కులు కాగా ప్రస్తుతం 3వేల క్యూసెక్కుల మేరకు విడుదల చేస్తున్నారు. అయితే ప్రస్తుతం ఎస్సారెస్పీ స్టేజ్1 ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరందని పరిస్థితులు నెలకొన్నా స్టేజ్ 2 ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేస్తున్నారు. స్టేజ్ 1లోని డిస్ట్రిబ్యూటరీలకు ఎక్కడికక్కడ కోత పెడుతూ, సామర్థ్యం మేరకు జలాలను విడుదల చేయకుండా, కేవలం కంటితుడుపుగా నీటిని విడుదల చేస్తూ స్టేజ్ 2 ఆయకట్టుకు నీటిని మళ్లిస్తున్నారు. సాగునీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒత్తిడిమేరకే ఎగువన ఆయకట్టుకు కోత పెడుతూ దిగువ ఆయకట్టుకు నీటిని తరలిస్తున్నారని తెలుస్తున్నది. అదేమని అడిగితే గతంలో ఉన్న టెయిల్ టు హెడ్ (చివరి నుంచి మొదలు) పద్ధతినే ప్రస్తుతం అనుసరిస్తున్నామని అధికారులు చెప్తున్నారు. ప్రాజెక్టుల్లో సమృద్ధిగా జలాలు ఉన్నప్పుడే ఆ పద్ధతిని అమలు చేయడం పరిపాటి. కానీ ప్రస్తుతం ప్రాజెక్టుల్లో నిరుడి కన్నా తక్కువ మొత్తంలో నీటి నిల్వలు ఉన్నా కూడా ఎగువ ఆయకట్టును విడిచి పెట్టి దిగువ ఆయకట్టుకు నీటిని విడుదల చేయమేంటని ఆయకట్టు రైతులు ప్రశ్నిస్తున్నారు. అదీగాక వారంపాటు నీటిని విడుదల చేయాల్సి ఉండగా కేవలం రెండు, మూడు రోజులు మాత్రమే డిస్ట్రిబ్యూటరీలకు నీటిని విడుదల చేస్తున్నారని రైతులు వాపోతున్నారు.

మార్చి రెండో వారం వరకే

ప్రస్తుతం ఎస్సారెస్పీ ఆయకట్టుకు సంబంధించిన ప్రాజెక్టుల్లో కేవలం మార్చి 2వ వారం వరకు మాత్రమే సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని అధికారులు వెల్లడిస్తున్నారు. పూర్తిస్థాయిలో సాగునీటిని అందించే పరిస్థితి లేదని తేల్చిచెప్తున్నారు. ప్రస్తుతం ఎస్సారెస్పీలో 50 టీఎంసీలు, ఎల్లంపల్లిలో 12.77 టీఎంసీలు, మిడ్‌మానేర్ 15.76 టీఎంసీలు, ఎల్ఎండీలో 16.49 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇక ఎస్సారెస్పీ జలాలపై ఆధారపడి చౌటుపల్లి హన్మంతరెడ్డి, అలీసాగర్, గుత్ప ఎత్తిపోతల ఆయకట్టు కూడా ఉన్నది. ఎల్లంపల్లి నుంచి హైదరాబాద్ తాగునీటి జలాలు కూడా ఇవ్వాల్సి ఉన్నది. ఇప్పటికే ప్రజాప్రతినిధుల ఒత్తిడి మేరకు ఎల్ఎండీకి 3 టీఎంసీల మేరకు జలాలను తరలించామని, ఇక అంతకు మించి ఇవ్వలేమని అధికారులు చేతులు ఎత్తేస్తున్నారు. మొత్తంగా ఎటుచూసినా మార్చి రెండో వారం వరకే సాగునీటిని విడుదల చేసే అవకాశాలున్నాయని వివరిస్తున్నారు. నిరుడిలో పోల్చితే భూగర్భజలాలు సైతం వేగంగా లోతుకు పడిపోతున్నాయి. దీంతో ఎస్సారెస్పీ ఆయకట్టు మొత్తం ప్రశ్నార్థకంగా మారే పరిస్థితులు నెలకొన్నాయి.

నీటిని ఎత్తిపోసుకునే అవకాశమున్నా..

పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉన్నా కూడా ప్రభుత్వం ఆ దిశగా దృష్టి సారించని దుస్థితి నెలకొన్నది. కాళేశ్వరం ప్రాజెక్టును బద్నాం చేయాలనేదానిపై చూపెడుతున్న ఆసక్తిని నీటిని ఎత్తిపోసుకునే అంశంపై కేంద్రీకరించడంలేదు. మేడిగడ్డలోని లక్ష్మీబరాజ్, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు మరమ్మతులు కొనసాగుతున్న కూడా నీటిని ఎత్తిపోసుకొనే అవకాశముందని అధికారులు వెల్లడిస్తున్నారు. ఇప్పటికీ ప్రాణహితలో రోజుకు సగటున 5వేల క్యూసెక్కులకు మించి ప్రవాహాలు కొనసాగుతున్నాయి. ఆ జలాలను ఒడిసిపడితే ఎస్సారెస్పీ ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీటిని అందించవచ్చని, చెరువులను కూడా నింపవచ్చని వివరిస్తున్నారు. లేదంటే చివరిదశలో నీరు అవసరయ్యే ప్రధాన సమయంలోనే చేతులేయ్యాల్సిన పరిస్థితి తలెత్తుందని, రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరిస్తున్నారు. అదీగాక ఆ సమయంలో ఎత్తిపోసుకుందామన్నా ప్రాణహితలో ప్రవాహాలు కూడా ఆశించిన మేరకు ఉండకపోవచ్చని చెప్తున్నారు.

ఐదేండ్లుగా ఎప్పుడూ ఇట్లా చూడలేదు

ఐదేండ్ల సంది ఇప్పుడే చూస్తున్నాం. కాలువల నీళ్లు లేకుండా వానకాలం, యాసంగి కాల్వ నిండా నీళ్లు వచ్చేది. ఈ ఏడు మిరప పంట బాగా దెబ్బతిన్నది. దాన్ని తీసేసి యాసంగి మక్కజొన్న, వరి పొలం సాగు చేస్తున్నాం. నీరు వదిలి పెట్టకుంటే పంటలు పండుడు కష్టమే అవుతది. వారానికి ఒకసారి నీళ్లు వస్తే కాల్వవ తడుసుడుకే సరిపోతది.

- అజ్మీరా శ్రీను, గోపతండా

గుంతలు నిండి తగ్గిపోయినాయి

వారం రోజులు ఒక వైపు మరోవారం మారో కాల్వకు నీళ్లు వదిలి పెడితే. ఎండాకాలం కావడంతో తడిసిన కాల్వ మల్ల తడిసి చెరువులకు నీరు అందే సరికి నీళ్లు బందు అవుతుంది. ఊరకుంటలో గుంతలు నిండేసరికి నీళ్లు బందు కావడంతో వచ్చిన నీళ్లు మల్ల తగ్గిపోయినాయి. కాలకవలో తుంగ, చెత్త తీసేందుకు ఎకరానికి రూ. 500లు వసూలు చేస్తున్నారు. మునుపు ఎప్పుడు గిట్ల మా కానుంచి పైసలు ఎవరు అడగలేదు.

- మంచాల శ్రీను, పడమటిగూడెం

వ్యవసాయ రుణ ప్రణాళిక 1.33 లక్షల కోట్లు

- ఇందులో క్రాప్‌లోన్ 81 వేల కోట్లు
- అన్నిరంగాలకు కలిపి 2.80 లక్షల కోట్ల రూపాయలు
- వచ్చే ఏడాదికి నాబార్డ్ రుణ ప్రణాళిక ఖరారు
- నాబార్డ్ రుణంతోనే తొలి నామినేషన్ వేశా
- ఫోకస్ పేపర్ విడుదల చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- వచ్చే ఏడాది కొత్త క్రాప్ ఇన్సూరెన్స్: రఘునందన్‌రావు

హైదరాబాద్‌లో నాబార్డు రుణ ప్రణాళికను విడుదల చేస్తున్న వ్యవసాయ మంత్రి తుమ్మల

హైదరాబాద్, జనవరి 30(నమస్తే తెలంగాణ): 2024-25 సంవత్సరానికి వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.1.33 లక్షల కోట్ల రుణాలు ఇచ్చేందుకు జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంక్ (నాబార్డ్) ప్రణాళిక రూపొందించింది. ఇందులో పంటల సాగు రుణాల కోసం రూ.81,478 కోట్లు, టర్మ్‌లోన్స్‌కు రూ. 27,664 కోట్లు, మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.5,197.26 కోట్ల రుణాలు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ఫోకస్ పేపర్ పేరుతో నాబార్డ్ ఖరారు చేసిన రుణ ప్రణాళికను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. అన్ని రంగాలకు కలిపి మొత్తంగా రూ.2.80 కోట్లతో రుణ ప్రణాళికను నాబార్డ్ ఖరారు చేసింది. ఇందులో అత్యధికంగా వ్యవసాయ రంగానికి రూ.1.33 లక్షల కోట్లు, ఎంఎస్ఎంఈలకు రూ.1.29 లక్షల కోట్లు, హౌసింగ్‌కు రూ.10,768 కోట్లు కేటాయించింది.

భారీగా పెరిగిన రుణాలు

గత సంవత్సరంతో పోల్చితే ఈ ఏడాది అన్ని రంగాలకు రుణాలను నాబార్డు పెంచింది. నిరుడు రూ.1.85 లక్షల కోట్లతో రుణ ప్రణాళికను నాబార్డు విడుదల చేసింది. ఈ ఏడాది అంతకంటే సుమారు రూ.94 వేల కోట్లు అదనంగా కేటాయించింది. వ్యవసాయ, అనుబంధరంగాలకు నిరుడు 1.12 లక్షల కోట్లు కేటాయించగా, ఈ ఏడాది 1.33 లక్షల కోట్లకు పెంచింది. ఇది గత సంవత్సరం కంటే దాదాపు రూ.20,825 కోట్లు అధికం.

నాబార్డ్ రుణంతోనే తొలి నామినేషన్ వేశా

తన జీవితంలో నాబార్డుకు ప్రత్యేక స్థానం ఉన్నదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. ఫోకస్ పేపర్ విడుదల అనంతరం ఆయన మాట్లాడుతూ.. తన రాజకీయ, వ్యక్తిగత జీవితంలో ఎదుగుదలకు ఈ సంస్థ ఎంతగానో ఉపయోగపడిందని గుర్తు చేసుకున్నారు. నాబార్డు వద్ద తీసుకున్న రుణం డబ్బులతోనే 1983లో తొలిసారిగా ఎమ్మెల్యేగా నామినేషన్ వేశానని తెలిపారు. వ్యవసాయరంగానికి వీలైనంత ఎక్కువగా రుణాలిచ్చి ఈ రంగం అభివృద్ధికి శక్తిమేర సాయం చేయాలని నాబార్డు అధికారులను కోరారు. ఆయిల్‌పాం సాగు కోసం రుణాలు ఇవ్వాలని, ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా డెయిరీ రైతులకు వ్యక్తిగతంగా రుణాలు మంజూరుపై దృష్టి పెట్టాలని సూచించారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు సేవలను మంత్రి కొనియాడారు. ఖమ్మం కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో రఘునందన్‌రావును చాలా కష్టపెట్టానని, అప్పుడు ఇద్దరం కష్టపడి ఖమ్మం జిల్లాను అభివృద్ధి చేశామని వివరించారు. ఇప్పుడు వ్యవసాయరంగాన్ని కూడా మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు.

వచ్చే ఏడాది కొత్త క్రాప్ ఇన్సూరెన్స్

వచ్చే ఏడాది కొత్త క్రాప్ ఇన్సూరెన్స్‌ను తీసుకొస్తున్నట్టు వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు తెలిపారు. రైతులకు అన్ని రకాలుగా మేలు జరిగే విధంగా దీనిని రూపొందిస్తామని భరోసా ఇచ్చారు. రైతుబంధు నిధులను కూడా పెంచబోతున్నట్టు తెలిపారు. రైతు వేదికలను మరింతగా రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అన్ని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం నాబార్డు తరుపున అన్ని విధాలుగా సహకారం అందిస్తున్నామని, పలు ప్రతిష్ఠాత్మక పథకాలకు రుణాలు ఇస్తున్నామని నాబార్డ్ సీజీఎం సుశీల చింతల తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ దేబాశీష్‌మిత్ర తదితరులు పాల్గొన్నారు.

వివిధ రంగాలకు వ్యవసాయ రుణ ప్రణాళిక

వ్యవసాయ రుణాలు	1,33,587.86
సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు	1,29,635.83
హౌసింగ్	10,768.58
విద్య	2,706.50
సామాజిక మౌలిక సదుపాయాలు	1,447.31
స్వయం సహాయక బృందాలు	836.20
పునరుత్పాదక విద్యుత్తు	566.61
ఎగుమతుల కోసం రుణాలు	451.67
మొత్తం	2,80,000.56

బొమ్మకూర్ రిజర్వాయర్ నుంచి నీటి విడుదల

- ఎర్రకుంట తండాకు చేరిన గోదావరి జలాలు

నమస్తే ఎఫెక్ట్

జనగామ రూరల్, జనవరి 30: 'పంట కందని జలం.. నెరైలిచ్చిన పొలం' శీర్షికన ఈ నెల 27న 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కాల్వ పనులు పూర్తి చేసి బొమ్మకూరు రిజర్వాయర్ నుంచి మంగళవారం నీటిని విడుదల చేశారు. దీంతో జనగామ జిల్లా ఎర్రకుంట తండా పరిధిలోని పొలాల్లో గోదావరి జలాలు పారాయి. ఎండిపోతున్న పంటలకు 'నమస్తే' జీవం పోసిందని రైతులతోపాటు గ్రామస్థులు అభినందనలు తెలిపారు. పత్రికలో వచ్చిన కథనంతో తమకు నీరు విడుదల చేశారని పలువురు రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

బొమ్మకూర్‌లో ఎర్రకుంట తండాకు రైతులతో కలిసి నీటిని విడుదల చేస్తున్న అధికారులు

మొదలైన కరెంట్ కష్టాలు

- వేళాపాలా లేని విద్యుత్తు సరఫరా
- నీరు లేక ఎండుతున్న పంటలు
- పదేండ్లు కరెంట్ కష్టాలు లేవన్న రైతులు

సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం చింతకుంటలో ఎండుతున్న వరి పొలం

అందోల్, జనవరి 30: 'పదేండ్లు ఇరాం లేకుండా కరెంట్ వచ్చింది. బోరు వేస్తే పొలం మొత్తం తడిచే వరకు నడుస్తుండే. కరెంట్ పోతదేమో అన్న ముచ్చటే లేదు. ఇప్పుడు కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడో పోతుందో తెల్వడం లేదు. రాత్రనక పగలనక పొలం కాడికి ఉరికే పరిస్థితి వచ్చింది' అంటూ సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం చింతకుంట రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా కరెంట్ సరఫరా సక్రమంగా లేదని గ్రామస్థులు చెప్పారు. పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వంలో ఇలాంటి కష్టాలు ఎప్పుడూ లేవని కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి గతంలో లాగా నిరంతరం కరెంట్ అందించి రైతాంగాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ వారంలో కరెంట్ కష్టాలు మరింత ఎక్కువయ్యాయని, తరచూ కరెంట్ పోవడం, రావడంతో మోటర్లు, స్టాటర్లు కాలిపోతున్నాయని వాపోయారు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు ఫోన్ చేసినా ఫలితం ఉండటం లేదని పేర్కొంటున్నారు.

పంటలపై వాతావరణ మార్పుల ప్రభావం

- ఇక్రిశాట్ అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 30(నమస్తే తెలంగాణ): వాతావరణ మార్పులపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతున్న వేళ ఇక్రిశాట్ తాజా అధ్యయనం మరింత ఆందోళనకు గురిచేస్తున్నది. క్లైమేట్ చేంజ్ ప్రభావం పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతున్నదని, ఎదుగుదల, పంట దిగుబడిపై ప్రతికూల ప్రభావం చూపిస్తున్నదని అధ్యయనం పేర్కొన్నది. ఉష్ణమండల, సమశీతోష్ణ ప్రాంతాల్లో ఉష్ణోగ్రత ఏటా ఒక డిగ్రీ మేర పెరుగుతున్నట్టు అధ్యయనంలో గుర్తించారు. పెరుగుతున్న కార్బన్ ఉద్గారాలు కూడా ప్రమాదకరంగా మారుతున్నాయని అధ్యయనకారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో వాతావరణ మార్పులను తట్టుకుని అత్యధిక దిగుబడి ఇచ్చే వంగడాలపై ఇక్రిశాట్ దృష్టిసారించింది.

తక్కువ నిధులతో ఎక్కువ నీళ్లిచ్చే ప్రాజెక్టులు

- సాగునీటి ప్రాజెక్టులపై పెట్టే ప్రతి పైసా ప్రజలకు ఉపయోగపడాలి
- ప్రాణహిత, చిన్నకాళేశ్వరం, నక్కలగండి, ఎస్సెల్బీసీ పూర్తి చేయాలి
- రాజీవ్‌సాగర్‌ను ఎన్ఎస్‌పీఎల్ కెనాల్‌కు అనుసంధానం చేయండి
- సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మంత్రి ఉత్తమ్‌తో కలిసి బడ్జెట్ ప్రతిపాదనలపై డిప్యూటీ సీఎం భట్టి సమీక్ష

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి వెచ్చించే ప్రతి పైసా ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అభిప్రాయపడ్డారు. తక్కువ నిధులతో ఎక్కువ నీళ్లు ఇచ్చే ప్రాజెక్టులను పూర్తి చేయడాన్ని ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచించారు. మంగళవారం ఆయన సచివాలయంలో సాగునీటి పారుదల శాఖ రూపొందించిన బడ్జెట్ ప్రతిపాదనలపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిన నేపథ్యంలో గత కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో చేపట్టిన ప్రాణహిత ప్రాజెక్టును పూర్తి చేయడం వల్ల ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా తాగు, సాగునీటి అవసరాలను తీర్చే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల కరీంనగర్ జిల్లాకు సాగునీరు ఇవ్వొచ్చని తెలిపారు. తక్కువ బడ్జెట్‌లో వీటిని పూర్తి చేయడానికి తగిన ప్రణాళికలు రూపొందించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. నల్లగొండ జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలను సాగులోకి తీసుకొనిరావడానికి ఎస్సెల్బీసీ టన్నెల్, నక్కలగండి ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. సీతారామ ప్రాజెక్టు పూర్తి కావడానికి జాప్యం జరుగుతున్నందున గత కాంగ్రెస్ ప్రభుత్వం డిజైన్ చేసిన రాజీవ్ సాగర్ ఎత్తిపోతల ప్రాజెక్టును పూర్తి చేసి ఎన్ఎస్‌పీఎల్ రెండవ జోన్‌లోని కెనాల్‌కు అనుసంధానం చేస్తే ఖమ్మం జిల్లాకు సాగునీటి ఎద్దడి ఉండదని చెప్పారు. మ